క్లుప్తంగా

జీసీసీ ద్వారా సరుకుల విక్రయం



జీసీసీ డీపోలో విక్రయాలు చేపడుతున్న మేనేజర్ నర్సింహులు

పాతపట్నం: గిరిజన సహకార సంఘం ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసరాలు జీసీసీ డీపో ద్వారా అమ్మకాలు చేస్తున్నామని జీసీసీ మేనేజర్ గొర్లె నర్సింహులు తెలిపారు. మండలంలోని లాబర జీసీసీ డీపోలో ఉన్న సరుకులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా నిత్యావసర సరుకులను గిరిజనులకు అమ్మకాలు చేపడుతున్నామన్నారు. కొనంగి, బాసిగిట్టంగి, టి.కొత్తూరుతోపాటు మెళియాపుట్టి మండలంలోని చంద్రగిరి తదితర గిరిజన గ్రామాల్లో సేల్స్‌మెన్‌ల ద్వారా విక్రయిస్తున్నామన్నారు. గిరిజన నాయకులు దొర పార్వతీశం, సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

నరుబుజ్జిలి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు సోమవారం రాయితీపై ఎరువుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఆర్బీకేల ద్వారా రాయితీపై పొందవచ్చునని వెల్లడించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ యమున, వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బుడుమూరు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన యూనిఫాం పంపిణీకి చర్యలు



యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఏపీఎంలు

సారవకోట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీఒక్క విద్యార్థికి నాణ్యమైన యూనిఫాం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీకి చేరిన యూనిఫాంను ఏపీఎం గోవిందరాజులతో కలిసి సోమవారం పరిశీలించారు. సుమారు 4 వేల మంది విద్యార్థులకు సరిపడా యూనిఫాం క్లాత్‌లు ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిని 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్కరికి 3 జతల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల మేరకు యూనిఫాంను కట్టలుగా కట్టినట్లు చెప్పారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.శైలజ సోమవారం తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులతోపాటు పలు శాఖల ద్వారా చేపట్టిన పనులపై ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు పలనుకు సంబంధించిన రికార్డులతోపాటు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారన్నారు. వాటికి సంబంధించి గ్రామాల్లో సభలు నిర్వహించి నివేదికలు తయారు చేశారన్నారు. ఆ నివేదికలను ప్రజావేదికలో వివరించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

బూర్జ: మండలంలోని ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు పెద్దపేట సచివాలయం పరిధిలో కొండపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంధకారంలో కొండపేట అనే వార్త సోమవారం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించారు. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎలక్ట్రికల్ ఏఈ జి.అప్పన్న తన సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఆయనకు గ్రామస్తులు, పీఏసీఎస్ డైరెక్టర్ వి.గోవిందరావు తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం జగన్‌కే మద్దతు



ఎమ్మెల్యే రెడ్డి శాంతితో తమ అభిప్రాయాలను పంచుకుంటున్న మహిళలు

- వృద్ధులు, లబ్ధిదారుల వెల్లడి
- గురండిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ

కొత్తూరు: ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడమే తమ బాధ్యత అని పలువురు వృద్ధులతోపాటు సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మండలంలోని గురండి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మొత్తాలను తెలిపే కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. కొడుకులు కంటే ఎక్కువగా చూసుకుంటున్న జగనన్నకు మా పూర్తి మద్దతు ఉంటుందని గ్రామానికి చెందిన బోర అన్నపూర్ణమ్మ, సాయమ్మతోపాటు పలువురు మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. జగనన్న ఇస్తున్న రూ.2,750 పింఛన్ డబ్బులతో కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. మనవడిగా, కొడుకుగా జగనన్న బాగా చేసుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా సంక్రమంగా అందుతున్నాయని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న అందిస్తున్న వైఎస్సార్ ఆసరా మొత్తంలో ఆవులు కొనుగోలు చేసి పాలు విక్రయించి కుటుంబాన్ని పోషిస్తున్నట్లు పతివాడ చిట్టెమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎటువంటి మధ్యవర్తులు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీకి లంచాలు ఇస్తే తప్ప.. పథకాలు అందేవి కావన్నారు. పేదల కోసం నిరంతరం కష్టపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామానికి చెందిన సల్ల పాపమ్మతోపాటు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా రూ.55 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. లో ఓల్టేజ్ సమస్య తీర్చాలని ఎమ్మెల్యేను సల్ల దేవదాసు కోరారు. ఈ సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో ఉపాధి పనులు ఇవ్వడం లేదని బోర ఇందుతోపాటు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి పనులు వెంటనే కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణారావుకు ఎమ్మెల్యే ఆదేశించారు. గురండి సర్పంచ్ బోర సింహాద్రినాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, ఎంపీటీసీ సభ్యుడు వసుము లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు లోతుగెడ్డ తిరుపతిరావు, బూర్లె శ్రీనివాసరావు, కామక త్రినాథరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, ఏపీఎం త్రినాథమ్మ, ఏఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి జి.వి.రమణ, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పొందూరు: పొందూరుశాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారని లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కొత్తూరు: మండలంలోని 43 గ్రామ పంచాయతీల పరిధిలో వైఎస్సార్ జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని స్థానిక హౌసింగ్ ఏఈ గణేష్ తెలిపారు. కొత్తూరులో సోమవారం ఏఈ మాట్లాడుతూ మండలంలో 897 మందికి జగనన్న కాలనీ ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. మంజూరైన ప్రతీ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఏఈ సూచించారు. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు దశలు వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సారవకోట: మండలంలోని బద్రి గ్రామానికి చెందిన అల్లు రామయ్య (78) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి తొలుత బుడితి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సింహాచలం కేసు నమోదు చేశారు.

ఎండ తీవ్రతకు అల్లాడుతున్న మూగజీవాలు



టెంట్ నీడలో ఉన్న గేదె

మెళియాపుట్టి: మండుతున్న ఎండల తీవ్రతకు మూగజీవాలు సైతం అల్లాడుతున్నాయి. సోమవారం మండలంలో ఇటువంటి దృశ్యాలే కనిపించాయి. జలకలింగుపురం గ్రామంలో మండుటెండలో నీడకరువై ఉపాధి పనులు చేసే ప్రదేశంలో వేసిన టెంట్‌లో గేదె ఉపశమనం పొందుతూ కనిపించింది. అలాగే మెళియాపుట్టిలో ఓసుకకం భానుడి ప్రతాపానికి తట్టుకోలేక కాలువ నీటిలో సేదతీరింది. వడగాలులు, తీవ్రమైన భానుడి ప్రతాపానికి ఉదయం 10 తర్వాత, సాయంత్రం 4 గంటలకు ముందు ప్రజలు బయటకు రావొద్దని అధికారులు చెబుతున్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు



జలుమూరు: జోనంకిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మప్రియ, ఎంపీపీ గోపి



సారవకోట: రామకృష్ణాపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జలుమూరు: వలంటీర్లు సంక్షేమ సారథులని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. లింగాలవలస, టి.లింగాలపాడు, జోనంకి సచివాలయాల్లో సోమవారం వలంటీర్లను సన్మానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, సర్పంచ్ జి.వి.రమణి, మండల సలహాదారుడు పైడి విఠలరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, పార్టీ నాయకులు కోన దామోదరరావు, వాన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం..

సారవకోట: మండలంలోని వాండ్రాయి, రామకృష్ణాపురం సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లకు సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. సేవామిత్ర ప్రసంశాపత్రాలను ఎంపీడీఓ విశ్వేశ్వరరావు అందించారు. సర్పంచ్‌లు సాదు సతీష్, పొన్నాన స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డెపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజా సేవకులు..

నరసన్నపేట: వలంటీర్లు ప్రజా సేవకులని ఎంపీపీ ఆరంగి మురళీధర్ అన్నారు. మండలంలోని కంబకాయ, కరగాం, తామరాపల్లి, కరగాం సచివాలయాల పరిధిలో గల వలంటీర్లను సోమవారం సత్కరించారు. వలంటీర్లుకు వందనం అనే కార్యక్రమంలో భాగంగా వారికి ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కంబకాయలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్ల సేవలను అభినందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, కంబకాయ సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాగోటి ప్రభాకర్, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, పాగోటి భరద్వాజ్ పాల్గొన్నారు.



నరసన్నపేట: సత్కారం పొందిన వలంటీర్లతో ఎంపీపీ, తదితరులు

క్రికెట్ టోర్నీ విజేత చింతపల్లి



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న తేజేశ్వరరావు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చింతపల్లి నిలిచింది. విజేతలకు పాతపట్నానికి చెందిన వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు సోమవారం బహుమతులు అందించారు. చింతపల్లి విన్నర్, పెద్దలోగిడి రన్నర్‌గా నిలవడంతో ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో యువకులు రాణించాలన్నారు. ఎంపీటీసీ దువ్వారి జోగారావు, మాజీ సర్పంచ్ డి.ఉదయ్‌భాస్కర్, సరాలి సర్పంచ్ పి.షణ్ముఖరావు, తిరుపతిరావు, పీఈటీ సుజాత, గ్రామ యువకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



పొందూరు: రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

పొందూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పొందూరు తాలూకా కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు సోమవారం చేపట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, నాయకులు తిరుపతిరావు, కిలారి నారాయణరావు, శివప్రసాద్, మోహన్, నీలాద్రిరావు, రజియా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

పాతపట్నం: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు ఇప్పిలి నారాయణరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పాతపట్నం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని, ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, డీఏలు, టీఏలు ఇవ్వాలని, జీపీఫ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. కర్రి లక్ష్మీనారాయణ, అప్పలనాయుడు, రాజేష్, లింగమూర్తి, మురళి, విఠల్, పద్మావతి, కాంచన, విజయలక్ష్మి, బాలరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో బంగారు భవిష్యత్తు



ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఉత్తమ విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులు మల్లాడ హాసిని, పొన్నాడ ఢిల్లీశ్వరరావు 581 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామరాజు విద్యా పురస్కారాన్ని విద్యార్థులకు ఎమ్మెల్యే సోమవారం అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి అనేక సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఎంఈఓ కె.రాంబాబు, హెచ్‌ఎం యు.ఎస్.ఎన్.మూర్తి, చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏపీ సురేష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొర్లె సురేష్, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వి.చిన్నారావు, చిరంజీవులు, లుకలాపు ప్రసాద్, అల్లుకృష్ణారావు, మీసాల శంకరరావు, బి.మురళి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాతపట్నానికి ఉత్సవ శోభ



ఆలయంలో హోమం చేస్తున్న గ్రామస్తులు



పాతపట్నం: విద్యుత్ దీపాలంకరణ

- 24న అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానం
- ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణి దుర్గ అమ్మవారి పెద్ద పండగతో పాతపట్నంలో ఉత్సవ శోభ నెలకొంది. అమ్మవారి ఆలయంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 24న దేవర జంగిడితో అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించనున్నారు. కాపువీధిలో ఉన్న ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ ఆస్పత్రి కూడలి నుంచి జూబ్లీ రోడ్డు మీదుగా కాపువీధి వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ హెడ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభంకానున్నాయి. యెరుకోల కాంప్లెక్స్ ఆవరణలో, ఆలీఆంధ్రా రోడ్డు పక్కన ఉన్న ఆవరణలో జెయింట్ వీల్, సాలంబో, స్నేక్‌కార్, స్మాల్‌ట్రెయిన్, బిగ్ ట్రైన్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



యెరుకోల కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లు

వరదనీటి సమస్యకు మోక్షం



వరద కాలువలో పూడిక తొలగించిన దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మిరియాపల్లి వంశధార నది నుంచి ధనుకువాడ వరకు ఉన్న ఓపెన్ హెడ్ చానల్ (వరద నీటి కాలువ) ఉపాధి హామీ పథకం పనుల్లో మెరుగుపడిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా కాలువ పనుల్లేక వరదనీరు పొలాల్లో నుంచి ప్రవహించేదని రైతులు తెలిపారు. కాలువలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, పూడిక మటి తొలగించటం వల్ల వరదనీటి సమస్యకు మోక్షం కలిగిందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ వి.శ్రీదేవి పర్యవేక్షణలో కాలువలో పూడికలు తొలగించే పనులు రైతులకు ఉపయోగపడేలా జరిగాయని మిరియాపల్లి గ్రామానికి చెందిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన కాలువ గట్లు



ఎ.ఎల్.నగరం వద్ద శిథిలమైన వంశధార కుడి ప్రధాన కాలువ రక్షణ గోడ

నరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువ గట్లు పలుచోట్ల పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గోనెపాడు నుంచి రొట్టవలస వరకు గల ప్రధాన కాలువలో ఎ.ఎల్.నగరం, బప్పడాం, గోనెపాడు, నరుబుజ్జిలి ప్రాంతాల్లో కాలువ గట్లు కోతకు గురయ్యాయి. సాగునీరు ప్రవహించే సమయంలో కాలువ గట్లుకు గండ్లు పడకుండా ఏర్పాటు చేసిన రక్షణ గోడలు కూడా పాడయ్యాయి. కాలువలోకి దిగేందుకు నిర్మించిన మెట్లు కూడా చాలాచోట్ల పగిలిపోయాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.